సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



డేంజర్‌లో మైనర్

రోడ్లపై బైక్‌లతో మైనర్లు దూసుకెళ్తున్నారు. ఏమాత్రం రహదారి నిబంధనలు తెలియని వీరు.. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. –8లో..



సమర్థ నాయకత్వం.. విజయానికి సోపానం

సమర్థ నాయకత్వం... విజయానికి సోపానాలు అని శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన పేర్కొన్నారు. –8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 414 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	581	581
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 25.500 కిలోలు

న్యూస్‌రీల్

నేడు నిమ్మనపల్లిలో 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి: ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం కోసం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 22వ తేది శుక్రవారం నిమ్మనపల్లి మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాస్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆర్‌వోబీ పనులు ప్రారంభం

పీలేరురూరల్ : పీలేరు పట్టణం ఎల్‌బీఎస్ రోడ్డు (మదనపల్లె) రోడ్డు జాతీయ రహదారి 71లో రూ.66 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తిరుపతి ఎన్‌హెచ్ డీఈ నాగరాజు తెలిపారు. గురువారం ఆర్‌ఓబీ నిర్మాణ పనులు ప్రారంభించారు.1.2 కిలోమీటర్ల పొడవు, 14 మీటర్ల వెడల్పుతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రెండేళ్లలోపు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

కేంద్ర ఆరోగ్య బృందం పరిశీలన

కలికిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ని పాపులేషన్ రీసెర్చ్ కేంద్రం బృందం సభ్యులు డాక్టర్ శ్రీనివాసరావు, సీహెచ్ పాదాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు స్థానిక వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమావేశమై ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడ అందుతున్న సదుపాయాలపై నేరుగా రోగులను విచారించారు. అనంతరం ఆసుపత్రిలో ఓపీ, మందుల నిల్వలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, డీపీఎంఒ డాక్టర్ లోకవర్ధన్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు ప్రశాంతం

రాయచోటి అర్బన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న 24 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు ఐసీడీయస్ పీడీ ధనలక్ష్మి తెలిపారు. జిల్లాలోని రాయచోటి ,లక్కిరెడ్డిపల్లె, పీలేరు, వాల్మీకిపురం అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధి నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి రాయచోటి ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ రంగస్వామి, పీడీ ధనలక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ప్రత్యామ్నాయ ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు

రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యామ్నాయ ఉద్యాన పంటగా ఆయిల్ పామ్ సాగుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తోందని జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు గురువారం తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఉద్యాన శాఖ, సువెన్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి మండలాలో వంద హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రైతులకు దేశీ రకానికి హెక్టార్‌కు రూ. 20 వేలు, దిగుమతి రకానికి రూ. 28 వేలు రాయితీ కల్పిస్తూ పంట సాగు ఖర్చులకు ప్రతి ఏడాది హెక్టార్‌కు రూ. 5250లు ఇస్తుందన్నారు. రైతులు దీనిపై దృష్టిసారించి రైతు భరోసా కేంద్రాలు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. ఉద్యానశాఖ అధికారులు ఆషియా, భాస్కర్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

మహిళలే నిర్ణేతలు



- పురుషులు 668552 మంది, మహిళలు 685071 మంది
- ఇతరులు 136 మంది..
- మహిళలదే పై చేయి

రాయచోటి : ప్రత్యేక ఓటర్ల జాబితా–2024 సంక్షిప్త సవరణకు సంబంధించి పునః పరిశీలన కూడా దాదాపు పూర్తయింది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో 13,53,759 లక్షలు ఓటర్లు ఉన్నట్లు ఓటర్ల జాబితాను పూర్తి చేశారు. ఈ జాబితాలో పురుషులు 6,68,552 మంది ఉండగా, మహిళలు 6,85,071 మంది, ఇతరులు 136 మంది ఉన్నారు. కొత్త ఓటర్ల జాబితాలో కూడా 16519 మంది పురుషుల కంటే మహిళలు అధికంగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ మహిళలదే పైచేయిగా అనిపించింది.

● 2024 –ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీల నుంచి 40,358 ఫిర్యాదులు అందినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఫిర్యాదులన్నింటికీ సంబంధించి పరిశీలన పూర్తి చేశామని కలెక్టర్ ఇటీవల నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు అందించిన ఫిర్యాదుల్లో 18936 మృతి కేసులు, 3799 శాశ్వతంగా బదిలీ అయిన ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీటన్నిటినీ ఇంటింటి సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలనను చేపట్టారు. ఈ పరిశీలనలో కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ, ఆర్డీఓలు నేరుగా పరిశీలించిన జాబితాను ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. దీంతో తొలగింపులకు సంబంధించి పరిశీలన పూర్తి అయినట్లు సమాచారం. జంక్ క్యారెక్టర్స్ 3700 ఈఆర్‌ఓనెట్‌లో అప్‌లోడ్ చేశారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8లలో పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. రాజకీయ పార్టీలతో బుధవారం కలెక్టర్ జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసి ఈ నెల 22న తుది జాబితాను ఎలక్షన్ కమీషన్‌కు పంపే ఏర్పాటు జరుగుతుందని కలెక్టర్ అన్నారు.

పైచేయి 'ఆమె'దే!

ఓటు హక్కు విషయంలో ఎప్పటిలాగే ఈసారి కూడా స్త్రీలే ఆధిక్యాన్ని చాటుకున్నారు. కొత్తగా విడుదలైన ఓటర్ల జాబితాలో కూడా మహిళా ఓటర్లదే అగ్రస్థానం. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 16519 మంది అధికం. అలాగే అన్ని నియోజకవర్గాల కంటే రైల్వేకోడూరులో తక్కువ ఓటర్లున్నారు. ఇక్కడ 1,92,528 మంది ఓటర్లున్నారు. మదనపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 2,48,834 మంది ఉన్నారు.

ఓటుకార్డుకు ఆధార్ లింక్:

ఓటు నమోదులో పారదర్శకత, డబుల్ ఓటింగ్‌ను అడ్డుకునేందుకు ఓటుకార్డుకు ఆధార్ లింక్ చేసే ప్రక్రియకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇటీవల ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. బ్యాంక్, పాన్, రేషన్‌కార్డు ఇతరత్రా ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరిగా మారింది. స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఓటర్లకు మాత్రమే అనుసంధాన ప్రక్రియకు ఎన్నికల కమీషన్ అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఓటర్ల నుంచి వచ్చే స్పందనను బట్టి భవిష్యత్తులో ఓటుకార్డుకు ఆధార్ లింక్ ప్రక్రియను వేగవంతం చేయొచ్చు.

4 విడతలుగా ఓటుహక్కు జారీ

కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏటా జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటరుగా పేరు నమోదు చేసుకొనే అవకాశం ఇస్తోంది. దీనివల్ల మధ్యలో ఓటుహక్కు అర్హత సాధించిన యువతీ యువకులు జనవరి వరకు వేచి చూడాల్సి వస్తోంది. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి ఏటా నాలుగు విడతలుగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆచరణలో పెట్టే దిశగా అడుగులు పడనున్నాయని సమాచారం.

నియోజకవర్గం : రాజంపేట (125)

పోలింగ్ కేంద్రాలు	282
పురుషులు	112513
స్త్రీలు	117061
ఇతరులు	212
మొత్తం ఓట్లు	229595

నియోజకవర్గం: కోడూరు(ఎస్సీ) (127)

పోలింగ్ కేంద్రాలు	248
పురుషులు	95239
స్త్రీలు	97272
ఇతరులు	17
మొత్తం ఓట్లు	192528

నియోజకవర్గం: రాయచోటి (128)

పోలింగ్ కేంద్రాలు	284
పురుషులు	121396
స్త్రీలు	122814
ఇతరులు	26
మొత్తం ఓట్లు	244236

నియోజకవర్గం: తంబళ్లపల్లి (162)

పోలింగ్ కేంద్రాలు	233
పురుషులు	106930
స్త్రీలు	108488
ఇతరులు	09
మొత్తం ఓట్లు	215427

నియోజకవర్గం: పీలేరు (163)

పోలింగ్ కేంద్రాలు	280
పురుషులు	110213
స్త్రీలు	112918
ఇతరులు	08
మొత్తం ఓట్లు	223139

నియోజకవర్గం: మదనపల్లి (164)

పోలింగ్ కేంద్రాలు	250
పురుషులు	122261
స్త్రీలు	126518
ఇతరులు	55
మొత్తం ఓట్లు	248834

చిరుధాన్యాలు.. ఆరోగ్యానికి మేలు

జిల్లాసైన్స్ సెమినార్‌లో డీవైఈఓ వరలక్ష్మి



సెమినార్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థికి ప్రశంసాపత్రం, మెమెంటో అందచేస్తున్న డీవైఈఓ వరలక్ష్మి

రాయచోటి అర్బన్: ఆరోగ్యం కోసం విద్యార్థులు చిన్నప్పటి నుంచే చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలని జిల్లా ఉపవిద్యాధికారిణి వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఏపీ విద్యాపరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ పిలుపుమేరకు స్థానిక డైట్ ఉన్నతపాఠశాలలో గురువారం జిల్లా సైన్స్‌సెమినార్‌ను జిల్లా సైన్స్‌అధికారి మార్ల ఓబుల్ రెడ్డి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరలక్ష్మి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా అలవాటు చేసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. స్థూలకాయం, చక్కెరవ్యాధి జీర్ణనాళం సమస్యలకు చిరుధాన్యాలు ఔషధంలాగా ఉపయోగపడతాయన్నారు. 'చిరుధాన్యాలు మంచి పోషకాహారమా ? ప్రతికర ఆహారమా ? అనే అంశంపై మండలస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు సెమినార్ నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన సెమినార్‌లో మొలకలచెరువు మండలం బుర్రకాయలకోట జడ్పీహైస్కూల్‌కు చెందిన మానస విశిష్టప్రతిభను కనపరచి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. రామాపురం ఏపి మోడల్‌స్కూల్ విద్యార్థిని ఉమేహాని ద్వితీయస్థానం, పీలేరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థి భానుశేఖరరెడ్డి తృతీయస్తానంలో నిలిచారన్నారు. రాయచోటి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలకు చెందిన అధ్యాపకులు విశ్వప్రసాద్, సుగుణలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో అప్‌కాస్ట్ జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

కళలు.. సంస్కృతికి ప్రతీకలు



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీఓ, జుడీషియల్ మెజిస్ట్రేట్

యువజనోత్సవంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్: సంస్కృతి, సాంప్రదాయాలకు కళలు ప్రతిబింబాల్లాంటివని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ జానపద గేయాలు, నృత్యాలు అర్థవంతంగాను, ఆలోచనాత్మకంగాను ఉంటాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఆద్యంతం ఉల్లాసంగా యవజనోత్సవం

యువజనోత్సవాలు ఆద్యంతం ఉల్లాసంగా సాగాయి. ప్రధానంగా జానపద గేయాలు ఆకట్టుకోగా, జానపద నృత్యాలు ఉర్రూతలూగించాయి. ఇందులో మదనపల్లెకు చెందిన శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినిలు తలపై కుండలు పెట్టుకొని చేసిన నృత్యం ఆశ్చర్యపరచింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని మూడువందల మందికి పైగా పాల్గొన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.పురుషోత్తం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

జానపద నృత్యం గ్రూపు విభాగంలో ప్రథమ బహుమతిని మదనపల్లెకు చెందిన జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల మనీషా అండ్ గ్రూప్ కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతిని అదే కళాశాలకు చెందిన మౌనిక అండ్ గ్రూప్ , జానపదగేయం గ్రూపు విభాగంలో మదనపల్లె జ్ఞానాంబికా డిగ్రీ కళాశాలకు చెందిన ఆర్.జీవిక అండ్ గ్రూప్ గెలుచుకున్నాయి. ఇక జానపద నృత్యం సోలో విభాగంలో ప్రథమ బహుమతిని మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన మనీష , ద్వితీయ బహుమతిని రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వై.శ్రావణి అందుకున్నారు. జానపద గేయం సోలో విభాగంలో మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన హిమబిందు, సాయిమేఘన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఫోటోగ్రఫీ విభాగంలో రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఏ.పృధ్వీ ప్రథమ, రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.రియాజ్ ద్వితీయ బహుమతులు గెలుపొందారు. స్టోరీ రైటింగ్ విభాగంలో ప్రథమ బహుమతిని రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కే.నందిని, ద్వితీయ బహుమతిని మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్.కోమల్ గెలుపొందారు. పోస్టర్ మేకింగ్‌లో ప్రథమ బహుమతిని రాజంపేట డిగ్రీ కళాశాలకు చెందిన పీ.వైష్ణవి, ద్వితీయ బహుమతిని ఆర్.లతిశ్రీ గెలుపొందారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

కలెక్టర్ గిరీషా పీఎస్



ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లా కేంద్రంలోని ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ)కి పటిష్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం రాయచోటి మార్కెట్ యార్డులోని ఈవీఎంల గోదామును అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న వీవీ ప్యాట్, బీయూ, సీయూ యూనిట్లను పరిశీలించారు. అలాగే ఎఫ్ఎల్‌సీ చేయుటకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఎఫ్ఎల్‌సీ చేసేందుకు ఈవీఎం గోదాము పక్కన ఉన్న మరో గోడౌన్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వివిధ అంశాలలో డీఆర్‌ఓ,ఆర్డీఓలతో చర్చించి పలు సూచనలు జారీ చేశారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయండి

కలెక్టర్ వెనుకవైపు కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ బంగ్లాల నిర్మాణం కోసం చేపట్టిన భూమి అభివృద్ధి పనులను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల మ్యాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. బంగ్లా నిర్మాణ పనులనువేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వం సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన లో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి వివిధ అంశాలలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందుకొని వివిధ అభివృద్ధి సూచికలలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనించేందుకు కలెక్టర్లు కృషి చేయాలని చెప్పారు.

ముదివేడు లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలోని ముదివేడు రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముదివేడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ రిజర్వాయర్ నిమిత్తం ముంపుకు గురి అయ్యే గ్రామాల బాధితులను పునరావాస లేఔట్లలో వేగంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, మదనపల్లి ఆర్డీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.


దైవ దర్శనానికి వెళ్తూ..

దైవ దర్శనానికి వెళ్తుండగా విషాదం చోటుచేసుకుంది. మార్గంమధ్యలో ఘోర ప్రమాదం జరిగింది. 30 మందితో వెళ్తున్న ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొంది. ఆ ప్రాంతంలో రోదనలు, ఆర్తనాదాలు మిన్నంటాయి.

- ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ
- ఇద్దరు దుర్మరణం
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పది మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు



దెబ్బతిన్న లారీ ముందు భాగం



మృతి చెందిన బస్సు డ్రైవర్ వెంకటనారాయణ



లారీ డ్రైవర్ మృతదేహం



గాయపడ్డ మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



బాధితురాలికి సపర్యలు చేస్తున్న స్థానికులు

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండల పరిధిలోని దేవపట్ల వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. పది మందికి గాయాలు అయ్యాయి. సంఘటన జరిగిన తక్షణమే మూడు 108 వాహనాల ద్వారా బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. వివరాలు ఇలా వున్నాయి. వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు, జమ్ములమడుగు ప్రాంతాలకు చెందిన 30 మంది వీరాంజనేయ ట్రావెల్స్ బస్సు ద్వారా గురువారం తమిళనాడు, కేరళ ప్రాంతాలలోని ఆలయాలు, సందర్శన ప్రదేశాల పర్యటన నిమిత్తం బయలుదేరారు. గురువారం రాత్రి 9:30 ప్రాంతంలో సంతోషాల మధ్య వారి ప్రయాణం సాగుతుండగా.. ఎదురుగా లారీ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. చిత్తూరు వైపు నుంచి వస్తున్న లారీ దేవపట్ల సమీపంలోకి రాగానే ఈ బస్సును ఢీకొట్టింది. రెండు వాహనాల ఇంజిన్లు నుజ్జునుజ్జుగా నలిగి పోవడంతో.. ఇరువురు డ్రైవర్లు మృతి చెందారు. బస్సు డ్రైవర్ కె.వెంకటనారాయణ (37) కాగా, లారీ డ్రైవర్ తమిళనాడు ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకొన్న సంబేపల్లె పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. క్షతగాత్రులైన వారిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు వాహనాలు ఇరుక్కుపోవడంతో జేసీబీ సాయంతో విడదీయాల్సి వచ్చింది. అప్పటికే డ్రైవర్లు మృతి చెందగా, ఇద్దరు సందర్శకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న వారిని స్థానిక వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పరిశీలించారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట రూరల్ సీఐ తులసీరామ్ ఉన్నారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

చివరి నిమిషంలో బస్సు డ్రైవర్ మారాడు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఎస్‌బీఆర్ టూర్‌కు సంబంధించిన ట్రావెల్స్‌కు తరచూ శ్రీకాంత్ డ్రైవర్‌గా వెళ్లేవాడు. అయితే చివరి నిమిషంలో పని ఉండటంతో శ్రీకాంత్ తనకు బదులుగా వెంకటనారాయణను పంపించాడు. సంబేపల్లె మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెంకటనారాయణను మృత్యువు కబళించింది. ప్రొద్దుటూరు మండలంలోని కానపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్, కిశోర్‌లు టూరిస్ట్ కాంట్రాక్టర్లు మహమ్మద్ యాఖూబ్, షబ్బీర్‌లకు చెందిన ట్రావెల్స్‌కు డ్రైవర్‌గా వెళ్లేవారు. గురువారం రామేశ్వరం, కన్యాకుమారి యాత్రలకు వెళ్లేందుకు శ్రీకాంత్ అడ్వాన్స్ కూడా తీసుకున్నాడు. అయితే అతను సొంత పని మీద గుంటూరు వెళ్లాల్సి రావడంతో చివరి నిమిషంలో వెళ్లలేకపోయాడు. అతని స్థానంలో ప్రొద్దుటూరుకు చెందిన వెంకటనారాయణను పంపించాడు. దీంతో వెంకటనారాయణ, కిశోర్ అనే ఇద్దరు డ్రైవర్లు బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో వెంకటనారాయణ మృతి చెందాడు.

20వ తేదీనే వెళ్లాల్సి ఉండగా..

ఈ నెల 20న రామేశ్వరం, కన్యాకుమారి, శ్రీరంగం తదితర ప్రాంతాలకు ప్రొద్దుటూరు నుంచి టూరిస్ట్ ట్రావెల్స్ బయలుదేరాల్సి ఉంది. అయితే బుధ వారం వినాయక నిమజ్జనం ఉండటంతో యాత్రికులందరూ గురువారం వెళ్దామని టూరిస్ట్ కాంట్రాక్టర్‌కు చెప్పారు. వారి కోరిక మేరకు గురువారం సాయంత్రం 5.15 గంటలకు బస్సు ప్రొద్దుటూరు నుంచి బయలుదేరింది. బస్సులో ప్రొద్దుటూరుతోపాటు జమ్మలమడుగు, మైదుకూరు, కడప ప్రాంతాలకు చెందిన 27 మంది మంది యాత్రికులు, ముగ్గురు వంట మనుషులు ఉన్నారు. 30 మందితో బయలుదేరిన బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది.

డేంజర్‌లో మైనర్


హర్షవర్ధనాచారి

• అతివేగం.. తీసింది ప్రాణం

పాఠశాలకు చేరాలనే ఆతృతతో అతివేగంగా నడుపుతూ జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డారు ఇద్దరు మైనర్లు. మండలంలోని బోడిగుట్ట, మెరంపల్లెకు చెందిన హర్షవర్ధనాచారి(07), నరేంద్రాచారి(15) పాఠశాలకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. గుర్రంకొండ సమీపంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి అవగాహనా రాహిత్యంతో ఢీకొని ప్రాణాల మీదకు తెచ్చుకొన్నారు.


నరేంద్రాచారి

రోడ్డుపై బైక్‌లతో మైనర్లు దూసుకెళ్తున్నారు. ఒకరికి మించి మరొకరు పోటీ పడుతూ వేగం పెంచి రయ్ రయ్‌మంటూ నడివీధిలో హల్‌చల్ చేస్తున్నారు. నిండా పదేళ్లు కూడా లేని పిల్లలు ద్విచక్ర వాహనం నడుపుతున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా నలుగురు ఒకే స్కూటర్‌పై షికారు కొడుతూ విన్యాసాలు చేస్తున్నారు. గుర్రంకొండలో ఈ దృశ్యాలు నిత్యం కనిపిస్తుంటాయి.


స్కూటర్‌పై వెళుతున్న మైనర్ విద్యార్థులు

- పాఠశాలలకు ద్విచక్ర వాహనాలపై మైనర్లు
- సైలెన్సర్లు తీసేసి శబ్దం చేస్తూ విన్యాసాలు
- వేగంగా నడపుతూ.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ
- మైనర్లకు వాహనాలు ఇవ్వద్దంటున్న పోలీసులు

గుర్రంకొండ : ద్విచక్ర వాహనాలను నడుపుతూ మైనర్లు తమ ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. గుర్రంకొండ పట్టణ పరిధిలోని కడప–బెంగుళూరు జాతీయ రహదారిపై పెద్ద పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లు పెట్టుకుని దూసుకెళ్తున్నారు. ఏమాత్రం రహదారి నిబంధనలు తెలియని వీరు.. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ఇటీవల ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడడం ఇందుకు అద్దంపడుతోంది.


గుర్రంకొండ బస్టాండులో స్కూటర్‌పై నలుగురు చిన్నారులు

మైనర్ల హల్‌చల్

ద్విచక్రవా హనాలపై మైనర్లు దర్జాగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఇవి పట్టణంలో నిత్యం కనిపించే దృశ్యాలే. పాఠశాల వదిలే సమయంలో తనతోటి ముగ్గురు, నలుగురిని ఎక్కించుకుని వేగంగా నడుపుతూ వెళ్లడంతో ఇతర విద్యార్థులు భయపడుతున్నారు. నిత్యం పాఠశాలకు వెళ్లేటపుడు, వచ్చే సమయంలోనూ మైనర్ల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. పదేళ్ల నుంచి పన్నెండేళ్ల వయస్సున్న వారు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. ఇంత వేగంగా నడిపినపుడు ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు. చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలిచ్చి రోడ్లపైకి పంపడంతో నడపడం చేతగాక ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

సైలెన్సర్ తీసి.. నడుపుతూ

కొంతమంది ఆకతాయి మైనర్లు సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాలు నడుపుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. స్కూటర్ ముందు భాగం పైకి లేపి విన్యాసాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం బెడిసి కొట్టి గుర్రంకొండ పట్టణంలో పది ప్రమాదాలు జరిగాయి. పలువురు మైనర్లు ఆస్పత్రులపాలయ్యారు. చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం



మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. పట్టణంలో నాకాబందీ నిర్వహించి మైనర్ల ద్విచక్ర వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. పలుచోట్ల రోడ్ స్టాపర్లను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించాం. పాఠశాల వేళల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పెద్ద శబ్ధాలతో నడిపే వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్నాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు.

– దిలీప్‌కుమార్, ఎస్‌ఐ, గుర్రంకొండ

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధుడికి అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో వృద్ధుడు అస్వస్థతకు లోనైన ఘటన గురువారం పీటీఎం మండలంలో జరిగింది. ఉప్పలవాండ్లపల్లెకు చెందిన ఆంజనేయులు(70) ఇంట్లో కిటికీని శుభ్రం చేస్తుండగా, అక్కడ ఉన్న పాము కాటేసింది. కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని బి.కొత్తకోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వృద్ధుడు కోలుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన శివశంకర్

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో గురువారం జరిగింది. తోకలపల్లెకు చెందిన హంద్రీనీవా పంప్‌హౌస్‌లో వాచ్ మెన్‌గా పనిచేస్తున్న ఆర్.శివశంకర్ (40) తన భార్య కళావతితో కలిసి ద్విచక్ర వాహనంలో గండవారిపల్లెకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా గండ్లవారిపల్లెవద్ద టాటాఏస్ ఢీకొంది. ప్రమాదంలో శివశంకర్ గాయపడ్డారు. స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బార్‌ల తనిఖీ


బార్‌లో మద్యం నిల్వల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఆయేషా బేగమ్

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ప్రైవేటు మద్యం బార్‌లను ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఆయేషాబేగమ్ గురువారం తనిఖీ చేశారు. రాయచోటి లోని నానీ బార్, గాలివీడులో ఆలమూరు బార్‌లను తనిఖీ చేసి మద్యం నిల్వలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. పరిశీలనలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులతో ఒకరు వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. అమ్మచెరువుమిట్ట రంగనాథ పెట్రోల్ బంక్ సమీపంలో సెలూన్ షాపు నిర్వహిస్తున్న పి.గంగాధర్(40) బుధవారం రాత్రి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి తర్వాత ఇంట్లోనే పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం చూసిన కుటుంబసభ్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై విచారించారు. బాధితుడికి ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. భార్య మానస ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన యువతి మృతి


మృతిచెందిన నాగలక్ష్మి

పెద్దమండ్యం : తమ్ముడితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొని యువతి మృతి చెందారు. ఎస్‌ఐ రామాంజనేయుడు కథనం మేరకు.. పెద్దమండ్యం పంచాయతీలోని మిట్టమాలపల్లెకు చెందిన రామసుబ్బయ్య కుమార్తె నాగలక్ష్మి(27) మదనపల్లె జీఆర్‌టీ జ్యువెలరీస్‌లో పనిచేస్తోంది. వినాయకచవితి పండుగకు ఇంటికి వచ్చిన నాగలక్ష్మి మంగళవారం తన తమ్ముడు నాగేష్‌తో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లికి బయలుదేరింది. పెద్దమండ్యం–గుర్రంకొండ రహదారిపై తురకపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో నాగలక్ష్మి తలకు తీవ్రగాయాలవగా, తమ్ముడికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో బాధితులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం నాగలక్ష్మి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

- ఐదుగురికి గాయాలు
- పోలీస్ పికెట్ కొనసాగింపు


గాయపడిన నరసింహులు

మదనపల్లె : వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటులో తలెత్తిన వివాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒకరినొకరు దాడి చేసుకోవడంతో పలువురికీ గాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. మండలంలోని వేంపల్లె హరిజనవాడలో వినాయకుడి విగ్రహాల ఏర్పాటులో ఆధిపత్య పోరు నెలకొంది. పోలీసులు సంఘటనా స్థలంలో ఉండగానే ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు వాగ్వాదం పెంచుకుని కర్రలతో దాడి చేసుకున్నారు. నరసింహులు వర్గంలోని నరసింహులు, నల్లప్ప, అర్జున్, మరో వర్గానికి చెందిన మంగళ, ఆమె భర్త రెడ్డప్ప గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలకు చెందిన నరసింహులు, మంగళ పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పారిశుద్ధ్య కార్మికుడిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన కేసులో ఆదర్శ కాలనీకి చెందిన నలుగురిని టూటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పాలిచెర్ల రాజశేఖర్ మున్సిపల్ శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదర్శకాలనీలో వినాయక నిమజ్జనం సందర్భంగా కాకిచంద్రపై కొందరు వ్యక్తులు రంగులు చల్లారు. అక్కడ మాటా మాటా పెరిగి వాగ్వాదం జరిగింది. కొంతసేపటి తర్వాత కాకి చంద్ర కొందరు వ్యక్తులను వెంట తీసుకెళ్లి వారిని బెదిరించాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం రాజశేఖర్ బాలాజీ నగర్‌లో పారిశుద్ధ్య పని చేస్తుండగా కాకిచంద్ర స్కార్పియో వాహనంలో వచ్చి అతన్ని తీసుకెళ్లాడు. కొర్రపాడు రోడ్డు లోని టీవీఆర్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లేసరికి రాజశేఖర్ అన్న వెంకటరమణ కనిపించగా అతన్ని కిడ్నాప్ చేసే ప్రయత్నం చేశారు. కూలీలు అడ్డుకోవడంతో రాజశేఖర్ కారులో నుంచి బయటికి వచ్చాడు. అతడి ఫిర్యాదు మేరకు కాకి చంద్రతోపాటు రామయ్య, బాలకుల్లాయప్ప, గురుప్రసాద్‌లను అరెస్ట్ చేసి రిమాండుకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చిన్నపెద్దయ్య

కమలాపురం : కమలాపురం పట్టణం వినాయక నగర్‌కు చెందిన వెంపటి నవీన్(26) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవీన్ బెంగుళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వినాయక చవితి పండగకు ఇంటికి వచ్చాడు. గురువారం తల్లి, అన్న స్వగ్రామమైన వల్లూరుకు వెళ్లారు. ఈ సమయంలో నవీన్ ఫ్యాన్‌కు ప్లాస్టిక్ వైర్‌తో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వచ్చి చూడగానే ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్నపెద్దయ్య మృతుడి నివాసానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ప్రేమించిన అమ్మాయికి వేరే అబ్బాయితో వివాహం జరిగిందని నవీన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వృద్ధుడు అట్ల సుబ్బారెడ్డి(60) మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఈ నెల 17వ తేదీన రాత్రి ఇంటి నుంచి అతని షెడ్డు వద్ద పడుకోవడానికి సుబ్బారెడ్డి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సుమారు ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయన తరచూ బాధపడేవారు. గురువారం ఉదయం ఉప్పలూరు విద్యుత్తు ఉపకేంద్రం వద్ద కంపచెట్లలో విగతజీవిగా కనిపించారు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి కుమారుడు మహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమర్థ నాయకత్వం.. విజయానికి సోపానం



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు కల్పన

కురబలకోట : సమర్థ నాయకత్వం... విజయానికి సోపానాలు అని శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన పేర్కొన్నారు. అంగళ్లులోని గోల్డన్ వ్యాలీ కళాశాలలో కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్మాస్టర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వ్యక్తి, వ్యవస్థ చివరకు దేశాలైనా.. నాయకత్వాన్ని బట్టే మనగలుగుతాయన్నారు. విజయవంతమైన నాయకుల్లో విలక్షణమైన లక్షణాలు ఉంటాయన్నారు. ఇలాంటివారిలో దార్శనికత, దూరదృష్టి, ప్రోత్సాహం, స్ఫూర్తి, ప్రభావితం చేయగల నైపుణ్యత ఉంటుందన్నారు. హెడ్మాస్టర్లు నాయకత్వ లక్షణాలను ఒడిసి పట్టుకుని స్కూల్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజలను భాగస్వామ్యులుగా చేసినప్పుడే ఏపనిలోనైనా సత్ఫలితాలు రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయాలన్నారు. విద్యా వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో సమర్థ నాయకత్వంతో బడులను నిర్వహించాలన్నారు.

గాయపడ్డ విద్యార్థి మృతి

కంచికచర్ల : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థి గురువారం మృతి చెందాడని ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు మండలంలోని పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు కళాశాల వదలిన తర్వాత చెవిటికల్లు కృష్ణానదిని చూసేందుకు ఒకే బైక్‌పై బుధవారం సాయంత్రం బయలుదేరారు. పరిటాల సమీపంలో రాగానే బైపాస్ రోడ్డు డివైడర్‌ను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన జీ కిషోర్ కుమార్ (20)కు తీవ్రగాయాలు కాగా మురళీకృష్ణ, నరేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కిషోర్‌ను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రితో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న బద్వేలు ఏడీఏ నాగరాజు, ఏఓ అరవిందనాయక్

గోపవరం : మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు, ఏఓ అరవిందనాయక్ కలిసి సాయిక్రిష్ణ ట్రేడర్స్, టి.వి.మోహన్‌రాజు ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ–పాస్ మిషన్‌లో నమోదు కాని 150 బస్తాల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రతి బస్తాపై రాయితీ ఆ కంపెనీలకు ఇస్తున్నందున ఆన్‌లైన్‌లో స్టాకు, దుకాణంలో నిల్వలకు మధ్య వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు ఉంటాయన్నారు.

అట్లూరు : మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద మహాలక్ష్మి ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరల పట్టిక, ఎరువుల బస్తాలు, తూకాలు, బిల్ పుస్తకాలు, స్టాకు రిజిస్టర్, ఈ–పాస్ మెషీన్ పనితీరు, అమ్మకాల వివరాలు, ధరల వివరాలు పరిశీలించారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. గడువు ముగిసిన సరకును రైతులకు విక్రయించరాదన్నారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కేసులను ఎత్తివేయాలి

జిల్లా ఎస్పీకి ఏపీయూడబ్ల్యూజే వినతి


జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

కడప కార్పొరేషన్ : వేంపల్లిలో జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి కోరారు. జర్నలిస్టులతో కలిసి వెళ్లి జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇసుక తరలిస్తున్న ప్రాంతంలో అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు చెబుతున్నప్పటికీ జేపీ కన్‌స్ట్రక్షన్స్ వారు ఇసుక తరలిస్తున్నారన్నారు. ఫిర్యాదుదారుడు తన ఫిర్యాదులో మీడియా సంస్థలను పేర్కొనకపోయినప్పటికీ ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ అత్యుత్సాహంతో కొన్ని పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారని చెప్పారు. ఎస్పీ స్పందిస్తూ జర్నలిస్టులపై పెట్టిన కేసుపై విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టు సంఘాల నాయకులు రామాంజనేయరెడ్డి, నారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, నూర్ బాషా, శివకేశవరెడ్డి, సిద్ధయ్య, సుబ్బారెడ్డి,రాజు, రహీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా పనులు పూర్తిచేయండి

చెన్నూరు: చాలా చోట్ల జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, పనులు పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వైఎస్ఆర్‌సీపీ నాయకులు నేషనల్ హైవే పీడీ నీరజ్ గుప్తా, ఆర్డీవో అధికారి మీరా ప్రసాద్ (ఆర్ఈపిఎల్) మదన్మోహన్, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డిలకు విన్నవించారు. కడప–కర్నూలు జాతీయ రహదారిని అధికారులు గురువారం పరిశీలించారు. ఆర్డీవో మీరా ప్రసాద్ మాట్లాడుతూ చెన్నూరులోని పెన్నా నది నుంచి గోసుల కళ్యాణ మండపం(ఆంధ్ర స్పైస్) హోటల్ వరకు రోడ్డు ప్రమాదాలు జరిగి 71 మంది మృత్యువాత పడినట్లు అధికారికంగా ధ్రువీకరించారన్నారు. చెన్నూరు వైఎస్ఆర్‌సీపీ నాయకులు చీర్ల సురేష్ యాదవ్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, పొట్టిపాటి రానా ప్రతాప్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డి, సాధిక్ అలీ, వారిష్ , హజ్రత్ తదితరులు రహదారి సమస్యలను అధికారులకు విన్నవించారు. చెన్నూరు కొత్త రోడ్డు నుంచి పెన్నా నది వరకు సర్వీస్ రోడ్లు, కాల్వ పనులు చేపట్టాలని, బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు. అరుంధతీ నగర్, కొత్త గాంధీ నగర్, బెస్త కాలనీలో పనులు అసంతృప్తిగా మిగిలిపోయాయని, బెస్త కాలనీ వద్ద మట్టితో సైడ్‌వాల్ వేసినా, వర్షం వస్తే కారుతోందన్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. వినతులను పరిశీలించిన అధికారులు కలెక్టర్‌తో సమావేశమై పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, అన్వర్ భాష, అబ్దుల్ రబ్, జుమన్, వెంకట సుబ్బయ్య, ఎర్రసాని నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరులోని హైవే పనులను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు